క్లుప్తంగా

'ఈ శ్రమ్'తో అసంఘటిత రంగ కార్మికులకు బీమా సౌకర్యం



ఈ-శ్రమ్ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న విక్రంరెడ్డి, హనుమాన్

ఘట్‌కేసర్: ఈ శ్రమ్ కార్డుతో అసంఘటిత రంగం కార్మికులకు బీమా సౌకర్యం లభిస్తోందని బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ అన్నారు. పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డు నమోదు కార్యక్రమానికి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో రమేష్, రామతీర్థ, రవిశంకర్, రవీందర్‌రెడ్డి, అజయ్‌యాదవ్, వీరేశం, మైపాల్ రెడ్డి, సిద్ధిరాజ్, అనీల్, పవన్, సురేంద్ర, శివ, ప్రవీణ్, సాయిప్రసాద్, మధు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



నారాయణరావును సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

ఘట్‌కేసర్: జిల్లాలో ఉత్తమ డివిజన్ వైద్యాధికారిగా అవార్డు పొందిన కీసర సహాయ జిల్లా వైద్యారోగ్య అధికారి నారాయణరావును ఘట్‌కేసర్ ఆరోగ్య కార్యాలయం సిబ్బంది శనివారం శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గంగాధర్, ఆరోగ్య విద్యా బోధకురాలు పద్మ, పీఎంఓఓ కైసర్ మోహినోద్దీన్, ఎస్‌యూఓ శ్రీనివాస్, డీఈఓలు సౌజన్య, శ్వేత ఉన్నారు.

పద్మశ్రీ హనుమంతరావుకు సన్మానం



హనుమంతరావుతో మండల బీఆర్‌ఎస్ నాయకులు

మేడ్చల్: ప్రముఖ సామాజికవేత్త, స్వీకార్-ఉప్‌కార్ సంస్థ చైర్మన్ హనుమంతరావుకు పద్మశ్రీ అవార్డు లభించడంతో నగరంలోని హనుమంతరావు నివాసంలో ఆయన్ను మండల బీఆర్‌ఎస్ నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మండల మానవహక్కుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



మేడ్చల్: మేడ్చల్ జ్యోతి స్వరూప అయ్యప్ప ఆలయంలో సంవత్సరం పాటు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ గురుస్వామి తాళ్ళపల్లి రాజేశ్వరగుప్తా తెలిపారు. కాగా శనివారం ఆలయంలో పాల్గొన్న భక్తులకు గురుస్వాములు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు కృష్ణమూర్తి, సురేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నెట్ బాల్ జేఎన్‌టీయూహెచ్ జట్టుకు ఎమ్మార్‌సీఈ విద్యార్థులు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూహెచ్ నెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన సెలక్షన్స్‌లో కళాశాల విద్యార్థులు ఎస్‌కే దానిష్, రాజేశ్‌లు జట్టులో చోటు దక్కించుకున్నారు. వచ్చే నెలలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో వీరు జేఎన్‌టీయూహెచ్ జట్టు తరపున పోటీల్లో తలపడనున్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ సురేశ్‌రెడ్డి, ఏఓ రాజేశ్, పీడీ సందీప్, అధ్యాపకులు అభినందించారు.

ఆకస్మిక తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

పోచారం: పోచారంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రూ.7.34 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. మూత్రశాలలు, ప్రహరీ, పెయింటింగ్, ఫర్నిచర్‌ను పనులను పరిశీలించగా ఆయనకు పోచారం మున్సిపల్ ప్రగతి నివేదిక 2020-23 ప్రతిని చైర్మన్ కొండల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్, పాఠశాల హెచ్‌ఎం రజిత, కౌన్సిలర్ సామల శ్రీలత, ఏఈ నరేష్, బద్దం జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ పాలకవర్గంలో...

జగడం!

- 20 మంది సంతకాలతో అవిశ్వాస తీర్మానం కాపీని కలెక్టరేట్‌లో అందజేత
- బాపట్లకు చేరుకున్న బీఆర్‌ఎస్ అసమ్మతి కార్పొరేటర్ల క్యాంపు
- రంగంలోకి దిగిన మంత్రి మల్లారెడ్డి
- అవిశ్వాసం నెగ్గాలంటే మ్యాజిక్ ఫిగర్ 18
- సమరానికి సై అంటున్న ఇరు వర్గాలు

సొంత పార్టీకి చెందిన మేయర్‌పై అవిశ్వాసానికి దిగిన కార్పొరేటర్లు



జవహర్‌నగర్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని కారు గుర్తుకు చెందిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు స్థానిక మేయర్ కావ్యపై కన్నెర్ర చేశారు. ఇన్నాళ్లుగా లోలోన రగిలిన అసంతృప్తి నేడు బద్ధలైంది. గత కొన్ని రోజులుగా అవిశ్వాస తీర్మాణంపై అడపా..దడపా.. వార్తలు వినిపించినప్పటికీ తన పదవికేమీ ప్రమాదంలేదని, మంత్రి మల్లారెడ్డి అన్ని తానై అసంతృప్తి వర్గాలను బుజ్జగిస్తాడని మేయర్ దీమాతో ఉంది. కానీ నేడు పరిస్థితి చేయి దాటినట్లు కనిపిస్తోంది. సొంతగూడికి చెందిన కార్పొరేటర్లంతా ఏకమై ఏకంగా జిల్లా కలెక్టర్‌కే మేయర్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టేందుకు అవకాశం కల్పించాలంటూ శనివారం సాయంత్రం వినతిపత్రం అందించారు. ఆ తర్వాత మేయర్ పీఠంపై కన్నేసిన ఒకరిద్దరు నేతలు అసంతృప్తి కార్పొరేటర్లందరిని తీసుకుని క్యాంపు రాజకీయాలకు తెర లేపారు. కార్పొరేటర్లంతా కలిసి బాపట్లకు వెళ్లినట్లు పయనమయ్యారు.

అధికార బీఆర్‌ఎస్‌కు షాక్...

సొంత పార్టీకి చెందిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లే అదే పార్టీకి చెందిన మేయర్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టాలంటూ కలెక్టర్‌ను వేడుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అటు పార్టీ అధిష్టానం కానీ.. ఇటు స్థానిక మంత్రి మల్లారెడ్డి కానీ ఈ సమస్యను ఎలా గట్టెక్కిస్తారని పలువురు ఆశగా ఎదురు చూస్తున్నారు. మంత్రి రంగంలోకి దిగి అసంతృప్తులను బుజ్జగిస్తారా.. లేక వారు మంత్రి మాట వినేందుకు సిద్ధంగా ఉన్నారా.. అనేది సందేహంగా మిగిలింది. మంత్రి ప్రయత్నాలు ఫలించకుంటే చివరికి పార్టీ అధిష్టానమే రంగంలోకి దిగే పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనప్పటికీ ప్రతిపక్షాలకు, జవహర్‌నగర్ కార్పొరేటర్ల తీరు ఒక విధంగా విమర్శానాస్త్రం కానుంది.

అవిశ్వాసానికి మ్యాజిక్ ఫిగర్ 18..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో గతేడాది 16వ డివిజన్ కార్పొరేటర్ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ప్రస్తుతం 25 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఒకవేళ అవిశ్వాసం పెడితే 18 మంది సంతకాలు అవసరమవుతాయి. కాగా ప్రస్తుత మేయర్ గట్టెక్కాలంటే ఆమెతో పాటు 9 మంది సంతకాలు చేయాల్సి ఉంది.



బాపట్ల క్యాంపునకు తరలిన బీఆర్‌ఎస్ అసమ్మతి కార్పొరేటర్లు

అంచనాలు తారుమారు...


2020లో నూతన పాలవర్గంలో కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కార్పొరేటర్లు, ఇండిపెండెట్లు ముగ్గురు, 21 మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ఉన్నారు. గతేడాది క్రితం ఇండిపెండెంట్లతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు మంత్రులు మల్లారెడ్డి, కేటీఆర్‌ల సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ప్రస్తుతం పాలకవర్గమంతా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లే ఉన్నారు.

మేయర్ పీఠంపై ఇద్దరి కన్ను..

మేయర్ పీఠంపై 28వ డివిజన్ కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్, 18వ డివిజన్ కార్పొరేటర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్‌లు కన్నేశారు. నిహారికగౌడ్ తండ్రి మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి కావడంతో తన కూతురు నిహారికకు మేయర్ పీఠం అప్పగించాలని మంత్రి మల్లారెడ్డి వద్ద చర్చిస్తుండగా.. కోటేష్‌గౌడ్ తన భార్య శాంతికే మేయర్ పదవి ఇవ్వాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. అయితే వీరిద్దరిలో ఎవరికైనా తమ మద్దతు ఉంటుందని అసమ్మతి కార్పొరేటర్లు చెబుతున్నారు. కాగా శనివారం బస్సులో అసమ్మతి కార్పొరేటర్లంతా బాపట్లకు పయనమయ్యారు.

సముదాయింపులో మంత్రి మల్లారెడ్డి...

జవహర్‌నగర్‌లో జరుగుతున్న పరిణామాలపై మంత్రి మల్లారెడ్డి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితమే ప్రస్తుత మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అవిశ్వాసం పెడతామని మంత్రికి సూచనప్రాయంగా తెలిపారు. దీంతో పలుమార్లు ఇరువర్గాలతో మాట్లాడి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. కానీ మేయర్‌పై ఆగ్రహంతో ఉన్న కార్పొరేటర్లు మంత్రికి సమాచారం ఇవ్వకుండానే క్యాంపునకు వెళ్లిపోవడంతో రాజకీయం మరింత వేడెక్కింది. దీంతో మంత్రి మల్లారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి పలువురు కార్పొరేటర్లతో స్వయంగా మాట్లాడారు. అధిష్టానం సూచనలకు అందరూ కట్టుబడి ఉండాలని సూచించినట్లు సమాచారం.



20 మంది కార్పొరేటర్ల సంతకాలతో అవిశ్వాస పత్రం

అవిశ్వాసం లేదు ఏమీ లేదు: మేయర్ కావ్య

ఐదేళ్ల వరకు తానే పదవిలో కొనసాగుతానని ప్రస్తుత మేయర్ మేకల కావ్య దీమా వ్యక్తం చేశారు. అతి చిన్న వయస్సులో మేయర్ పీఠాన్ని ఎక్కిన తాను ఎన్నో అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు నడుస్తున్నానని, మంత్రి మల్లారెడ్డి సహాయ, సహకారాలతో జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్నానన్నారు. సొంత పార్టీకి చెందిన వారే ఇలా చేయడం పద్ధతి కాదని, ఇప్పటికీ మాకే అందరి మద్దతు ఉందని, వారి మాటలు పట్టించుకోవద్దని ఆమె అన్నారు.

ఎంతటి పోరాటానికైనా సిద్ధం: అసమ్మతి కార్పొరేటర్లు

మంత్రి మల్లారెడ్డి మాటలతో ఇన్నాళ్లు ఓపిక పట్టామని, ఇక సహించలేమని కార్పొరేటర్లు అల్టిమేటం జారీ చేశారు. గతంలో మేయర్, ఆమె తండ్రి వ్యవహారం ఎన్నోసార్లు వివరించామని, ఇక ఓపిక నశించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జవహర్‌నగర్ అభివృద్దే మా లక్ష్యమని, ఎంతటి సమరానికైనా సిద్ధంగా ఉన్నామని అసమ్మతి కార్పొరేటర్లు తెలుపుతున్నారు.

న్యాయ బంధు యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కార్యక్రమంలో నల్సార్ రిజిస్ట్రార్

మేడ్చల్‌రూరల్: భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన న్యాయ బంధు మొబైల్ యాప్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నల్సార్ రిజిస్ట్రార్ విజ్ఞులతరెడ్డి అన్నారు. మండలంలోని పూడూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శామీర్‌పేట్ నల్సార్ లా యూనివర్సిటీ వారు ప్రొఫెసర్ బోనో లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ సేవ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్ఞులతరెడ్డి, ఢిల్లీ నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ భారతియాదవ్‌లు పూడూర్ గ్రామస్తులకు న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. అంతకుముందు వివిధ మార్గాల ద్వారా తమ న్యాయ సంబంధిత సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో ప్రజెంటేషన్స్ ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. న్యాయ బంధు యాప్ ఎలా వినియోగించుకోవాలి? దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొ.బోనో లీగల్ సర్వీసెస్ నోడల్ అధికారి అశ్విని కుమార్, గ్రామ ఉప సర్పంచ్ మానేపల్లి వెంకటేశ్, న్యాయ విద్యార్థులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాలా పనులు చేపట్టేందుకు చర్యలు



నాలాను పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి, అధికారులు

కీసర: నాగారం మున్సిపాలిటీ దాయరకుంట నుంచి చర్లపల్లి వరకు గల నాలా పనులు చేపట్టేందుకు క్షేత్రస్థాయిలో శనివారం హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీ పరిధి వరదముంపు కాలనీలకు శాశ్వత ప్రాతిపదికన వరద ముంపు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అంతకుముందు ఎస్వీనగర్‌కాలనీ రోడ్డు నం.4లో వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ, డిప్యూటీ ఏఈ వెంకటరమణ, హెచ్‌ఎండబ్ల్యూఎస్ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం నాగరాజు, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, అనితాసుధాకర్ రెడ్డి, మోకు రేణుక జగన్మోహన్‌రెడ్డి, సబితా ఆంజనేయలుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడు ఎల్లయ్య

శామీర్‌పేట్: కారు, టీవీఎస్ లూన ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామానికి చెందిన ఎల్లయ్య తన లూనాపై ఉద్దమర్రి గ్రామ పరిధిలోని జామతోట వైపు వెళ్తూ అదే మార్గం గుండా వెళ్తున్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎల్లయ్య కాలు విరిగిపోగా స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కారు టైరు మారుస్తుండగా డీసీఎం ఢీ..

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

పటాన్‌చెరుటౌన్: కారు టైరు మారుస్తుండగా వెనుక నుంచి ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు వివరాల ప్రకారం.. హైదరాబాద్ కొంపల్లికి చెందిన ప్రదీప్ గోయాంక(64) శనివారం తెల్లవారుజామున ఎల్బీనగర్ నుంచి మేడ్చల్‌కు చింతల్‌కు చెందిన డ్రైవర్ ఓం ప్రకాశ్‌తో కలిసి కారులో బయల్దేరాడు. దారి తెలియక డ్రైవర్ పటాన్‌చెరు మండల పరిధి పోచారం సమీప రింగ్ రోడ్డులో కారు వేగం తగ్గించాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం కారును ఢీకొట్టడంతో కారు టైర్ బ్లాస్టయింది. దీంతో డీసీఎం డ్రైవర్ మోతీరామ్ వాహనాన్ని పక్కన నిలిపి కారు వద్దకు వచ్చాడు. కారు డ్రైవర్ ఓం ప్రకాష్, డీసీఎం డ్రైవర్ మోతీరామ్ కారు టైరు మారుస్తున్నారు. ఇది రహదారిపై ప్రదీప్ గోయాంక నిలబడి చూస్తుండగా ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందగా.. ఓంప్రకాశ్, మోతీరామ్‌లు గాయపడ్డారు. చికిత్స కోసం ఓంప్రకాష్‌ను సనత్‌నగర్ ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించగా.. మోతీరామ్‌ను యశోద ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మోతీరామ్ స్వస్థలం సిద్దిపేట జిల్లా అక్కపేటగా గుర్తించారు.

ఖబ్రస్థాన్‌కు భూమి కేటాయింపు



ప్రొసీడింగ్ అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని సర్వే నంబర్.152లో ఖబ్రస్థాన్‌కు భూమి కేటాయిస్తూ మంత్రి మల్లారెడ్డి ప్రొసిడింగ్ అందజేశారు. గతంలో కేటాయించిన సర్వే నంబర్.166లోని భూమికి సమీపంలో నివాస గృహాలు, బాలికల ఐటీఐ భవనం ఉందని మంత్రికి స్థానికులు వినతి అందజేశారు. మంత్రి స్పందించి స్థానికులు విన్నపం మేరకు ముందు కేటాయించిన సర్వే నంబర్.152లోని భూమిలోనే శ్మశాన వాటిక నిర్మించాలని మంత్రి తిరిగి ప్రొసిడింగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, కీసరగుట్ట డైరెక్టర్ నరేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, సిరాజ్ పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు



విద్యార్థినితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. ప్రతాపసింగారం పంచాయతీ కార్యాలయం, జెడ్పీ పాఠశాలను శనివారం జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వేతనాలు, పన్నుల వసూళ్లు, పలు పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం డిజిటల్ క్లాస్ రూం, తరగతి గదులు, డైనింగ్ హాలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నాం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కమిషనర్ వాణీరెడ్డిలు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులోని బాపూజీ నగర్‌కాలనీలో సుమారు రూ.7.3 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొమురెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, యాకయ్య, సత్యంరాజు, నర్సింహ, జగన్‌మోహన్‌రెడ్డి, రాంసుధాకర్ చంద్రయ్య, రమేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి శివాలయ 19వ వార్షికోత్సవంను వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమాలు, అర్చనలు, అభిషేకాల్లో మాధవనందా స్వామి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు నందారెడ్డి, మాజీ సర్పంచ్ సునందారెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, నాగప్ప, గురుస్వామి కృష్ణమూర్తి భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌టీసీలో ముగిసిన క్రీడా పోటీలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో గత నాలుగు రోజుల పాటు సాగిన క్రీడా పోటీలు శనివారం ముగిసాయి. ఈ పోటీల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్ వంటి పలు క్రీడల్లో విజేతలకు కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ దుర్గాప్రసాద్‌రెడ్డి, ఉపేందర్, శ్రీధర్, మానయ్య, సుభాష్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో జిల్లాకు అన్యాయం'

మేడ్చల్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీల్లో ప్రభుత్వం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు తీరని అన్యాయం చేస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ అన్నారు. నిబంధనల ప్రకారం ఏర్పడిన ఖాళీలను 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, 70శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా అసిస్టెంట్ కేడర్లలో ఉన్న వారిని ప్రభుత్వ జీఓల ద్వారా భర్తీ చేస్తున్నారన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో నిరుద్యోగులకు ఖాళీలు లేకుండా పోతాయని, జిల్లాలో ఖాళీలు లేక పక్క జిల్లాలకు వెళ్లి పరీక్షలు రాయాలంటే 5 శాతంతో పోటీ పడాల్సి వస్తోందన్నారు. జిల్లాలో పూర్తిస్థాయిలో నియామకాల కోసం ఉన్న ఖాళీలను నిబంధనలకు విరుద్ధంగా భర్తీ చేయడం వల్ల యువత తీవ్రంగా నష్టపోతారని, ఈ విషయంపై జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి జిల్లా నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశాడు.

టౌన్‌షిప్ ప్రహరీ తొలగింపుపై ఫిర్యాదు



గూడ కూల్చివేసిన ప్రదేశం ఇదే..

పోచారం: అన్నోజిగూడ నుంచి సంస్కృతి టౌన్‌షిప్‌కు వెళ్లే రహదారికి ఆనుకొని ఉన్న ప్రహరీని ఈ నెల 25న పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు తొలగించారు. గోడ కూల్చివేసిన విషయాన్ని టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాదరావుతో పాటు హౌసింగ్ బోర్డు డీఈ రామ్ కుమార్ దృష్టికి మాజీ అధ్యక్షుడు శ్రీగిరి వెంకట్ మాధవ్ రెడ్డి తీసుకెళ్లారు. దీంతో ఇరువురు స్పందించి 27వ తేదీ సాయంత్రం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాధవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఘటన జరిగిన వెంటనే ఫిర్యాదు చేయకుండా మూడో రోజు వరకు ఎందుకు ఆగారని అసోసియేషన్ కమిటీ సభ్యులను, హౌసింగ్ బోర్డు అధికారులను ప్రశ్నించారు. మూడు దారుల కోసమే ప్రహరీ గోడను తొలగించవచ్చని సుప్రీం కోర్టు 2017లో అనుమతి ఇచ్చిందన్నారు. కోర్టు ఆదేశాలను అతిక్రమించి మరో గోడ కూల్చివేశారని, నూతన కమిటీ ఏర్పడిన తొలి రోజుల్లోనే ఇలాంటి చర్యలు చోటు చేసుకోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. మాజీ ఉపాధ్యక్షుడు మెట్టు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అనుమతి తీసుకోకుండా గోడ కూల్చివేయడం సబబు కాదని, గోడను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు.

సెయింట్ మార్టిన్ హైస్కూల్ వార్షికోత్సవం



వేడుకలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ శిల్పా వెంచర్ రహదారిలో గల సెయింట్ మార్టిన్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదువుకోవాలని, చదువుల్లో రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చనన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కామిడి వీరారెడ్డి వర్ధంతి



వీరారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

శామీర్‌పేట్: కామిడి వీరారెడ్డి వర్ధంతి సందర్భంగా మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేశవరంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ హారికమురళీగౌడ్, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు జాంరవి, కృపాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.